# మల్లినాథ సూరి

రాత్రి భోజనాలయ్యాక వెన్నెట్లో చల్లగాలికి పక్కలేసుకొని పడుకున్నాం. మా తమ్ముడు నా పక్కన జేరి "అక్కయ్యా! నిద్దర రావటం లేదు; కథ ఏదైనా చెప్పవూ?" అంటూ అడిగాడు. అది వాడికి రోజూ అలవాటే. అందుకని నాకు విసుగేసింది. "వెధవా! రోజూ నీకోసం కథలు సృష్టించడానికి యిక్కడ ఎవరు తీరిగ్గా కూర్చున్నారురా? మాట్లాడకుండా పోయి పడుకో!" అని గదమాయించేశాను.

వాడు కాస్సేపు ఊరుకున్నట్లే ఊరుకుని "అక్కయ్యా; మరి-మా సంస్కృతపు మేస్టారు-రోజూ మొదట్లో ఒక పద్యాం చదివిస్తాడు- "జ్ఞానానంద మయం దేవం" అని,- దాని అర్థం ఏమిటే? అల్లా రోజూ అదే పద్యం చదవటానికి మాత్రం నీకు విసుగు వెయ్యదుటే?" అని తన ధర్మ సందేహాన్ని వెళ్ల బెట్టాడు.

"ఓరినీ!! అదేమిటనుకున్నావు? హయగ్రీవోపాసన. దానివల్ల సకల విద్యలూ వస్తాయి" అన్నాను.

"అసలా హయగ్రీవు డెవరే?" అన్నాడు ఉత్సాహంగా. "హయగ్రీవుడా! విష్ణుమూర్తి ఒకప్పుడు అశ్వరూపం ధరించేడు. అది ఎల్లాంటి గుర్రం అనుకున్నావు! తె...ల్ల...ని గుర్రం. దాని పేరే హయగ్రీవము" అన్నాను.

"అయితే, అక్కయ్యా! అన్ని విద్యలూ వస్తాయన్నావు; బండ లెక్కలు కూడ వస్తాయిటే?" అని అడిగాడు-(లెక్కలు వాడికి ఎంతకీ కొరుకు బడటం లేదు లెండి!)

"ఓస్! వెధవ లెఖ్ఖలో లెఖ్ఖ? నీకన్నా మొద్దబ్బాయి,- ఆ మల్లినాథ సూరికే హయగ్రీవుడు సకల విద్యా పారంగతుణ్ణి చేసేశాడు" అన్నాను.

"ఏమిటో, నువ్వు చాలా కొత్త కొత్త పేర్లు చెప్తున్నావు యీ వేళ! ఇంతకీ ఆ మల్లినాథ సూరి ఎవరు?

శ్రీమతి డి. పార్వతి

మా మేస్టరు వాణ్ణి ఎప్పుడూ మాతో జతచేసి చెప్పలేదే!" అన్నాడు.; ఆ మల్లినాధుడు తన సహపాఠి అయినట్లు.

"ఓరి బడుద్ధాయీ! మల్లినాథు డెవ రనుకున్నావ్? అతడొక గొప్ప విద్వాంసుడు. మహాకవి కాళిదాసు వ్రాసిన 'రఘువంశము' 'కుమారసంభవం' 'మేఘసందేశం' లాంటి గొప్ప గొప్ప కావ్యాలకి వ్యాఖ్యానాలు రచించిన వ్యక్తి" అన్నాను.

"మరి ఆయన నాకన్న బండ బడుద్ధాయి అన్నావు కదా? అల్లాంటి వాడు వ్యాఖ్యానాలు ఎట్లా రాయగలిగేడే?"

"అదంతా ఒక పెద్ద కథ. రేపు చెప్తాలే; యీపూటికి పడుకో"

"అక్కయ్యా! మంచి దానివే; కథ చెప్పవూ? లేకపోతే నాకు తెల్లవార్లూ నిద్ర పట్టదే" అని మారాం చేశాడు.

"అయితే చెప్తాగాని మధ్యలో అడ్డుప్రశ్న వేయక విను"

"ఒకానొకప్పుడు ఒక తెలుగు గ్రామంలో ఒక గొప్ప పండితు డుండేవాడు. ఆయనకి లేక లేక ఒక కొడుకు పుట్టాడు. అతడికి మల్లినాథుడని పేరు పెట్టారు. "పండిత పుత్ర శుంఠః" అన్న లోకోక్తికి దీటు పోకుండా ఈ పుత్ర రత్నం పరమ శుంఠగా తయారైనాడు. నా అంతటి పండితుడికి యిల్లాంటి దౌర్భాగ్యము కలిగేదేమా అని పాపం-ఆ బ్రాహ్మడు కుమిలి పోయ్యాడు. ఇట్లా వుంటూ వుండగా కొంత కాలానికి ఈ కొడుక్కి పెళ్లీడు వచ్చింది. ఒక పొరుగూరి బ్రాహ్మడు అబ్బాయిగారి గుణగణాలు తెలిసికోకుండానే, అబ్బాయి తండ్రి పెద్ద పండితుడు కదా అన్న నమ్మకం కొద్దీ తన పిల్లనిచ్చి పెళ్ళి చేసేశాడు.

"కొన్నాళ్లకి అల్లుణ్ణి పండక్కి తీసి కెళ్లేరు. అత్తవారింట మన మల్లినాథుడు దిట్టంగా మూడ్పొద్దులా పిండివంటలు ఆరగించి శుభ్రంగా పడి నిద్ర పోయేవాడు. మల్లినాథుని భార్య మంచి తెలివిగలది;

# మల్లినాథసూరి



బాగా చదువుకున్నదీను. తల్లీ కూతుళ్లకి అబ్బాయి తిని పడుకుంటాడే కాని విద్యా వ్యాసంగం లేదేమో - అని అనుమానం కలిగింది.

"రోజూ రాత్రి పూట మల్లినాథుని మామగారు పురాణ కాలక్షేపం చేసేవాడు. ఒకరోజు ఆయన ఏదో పనిమీద పొరుగూరు వెళ్లేడు. అల్లుణ్ణి పరిక్షించడానికి మంచి అవకాశం కలిగింది అత్తగారికి. "నాయనా ఇవ్వాళ్టికి నీవు చదువు పురాణం" అని వ్యాసపీఠం, తాటి ఆకుల పుస్తకం, తమల పాకులు, వక్కలు అన్నీ సిద్ధ పర్చింది. కూతురితో సహా అతి శ్రద్ధగా పురాణం వినడానికి వచ్చి కూర్చుంది.

"మల్లినాథుడికి, "ఓ"కి ఎన్ని వంకర్లున్నాయో కూడా తెలియదామె! ఇంక పురాణమేం చదువుతాడు? అందుకని కట్ట తమలపాకులు తాపీగా కూర్చొని నమిలేసి వ్యాసపీఠాన్ని అటూ, ఇటూ తిప్పి, పుస్తకం తలక్రిందుగా తెరిచాడు. ఆ తాటాకు పుస్తకంలో ఒక ఆకు తర్వాత మరోఆకు తిరగేస్తూ ఆవలించటం, చిటికె లేయటం సాగించాడు. దాంతో అబ్బాయిగారి బండారం బయట పడింది. భార్య "పలాశకుసుమాయధా" అంటూ లేచింది. అత్తగారు "నిద్ర వస్తున్నట్లున్నది, పడుకో నాయనా" అంటూ పుస్తకం మూసేసింది.

"మల్లినాథునికి భార్య అన్న పదానికి అర్థం అయితే తెలియ లేదు కానీ, ఆ ముక్క బాగా జ్ఞాపకం పెట్టుకు పడుకున్నాడు. మర్నాడు యాయవారాని కొచ్చిన బ్రాహ్మణ్ణి పిలిచి "అయ్యా! 'పలాశ కుసుమాయధా' అంటే అర్థమేమిటి?" అని ప్రశ్నించాడు. ఆయన-"ఓరి పిచ్చివాడా! మోదుగ పుష్పంలాగా చూడ సొంపే కాని వాసన లేదని అర్థం" అని వ్యాఖ్యానించాడు.

"దాంతో మల్లినాథునికి ఎక్కడ లేని రోషం పుట్టుకొచ్చి "ఛీ వెధవ జన్మ! విద్య రానందుకు కదా, నా భార్య నన్నింత చులకనగా మాట్లాడింది!! యేమైనా పండితుణ్ణి కాందే ఆమె ముఖం చూడరాదని" శపథం పట్టి, యశాయకి విద్యల

పుట్టిల్లయిన కాశీకి బయలుదేరి వెళ్లేడు.

"అక్కడ-కాశీలో-తన తండ్రికి ముఖ్య స్నేహితుడైన ఒక విద్వాంసుని జేరి, తనకు విద్యా దానం చేయమని కాళ్లమీద పడ్డాడు. అబ్బాయి గారి వ్యవహారం తెలియక ఆయన "తర్కం మొదలు పెట్టనా? వ్యాకరణం మొదలు పెట్టనా?" అని ప్రశ్నించాడు.

"అయ్యా నాకు ఓనమః దగ్గర నుంచీ నేర్పాల్సిందే" నని విన్నవించగా, ఆయన ఆశ్చర్యపోయి, "సరే" నని ఒప్పుకున్నాడు.

"కొన్ని సంవత్సరాలు గడిచాయి; కాని మల్లినాథుని చదువు ఓనమాల నించి పైకిపోలేదు; కాని పట్టుదల వృద్ధి అయింది. తనకిక చదువు రాకపోతే ప్రాయోపవేశం చేస్తానని ఒకనాడు ముక్కుమూసుకు గంగలో కూచున్నాడు. గురువుకి యితనిమీద జాలి గలిగి "నాయనా! మల్లినాథా! నిరాశ పడక నే చెప్పినట్లు చెయ్యి. ఇవ్వాళ వుపవాసముండి మన పశువుల శాలలో మూలనున్న గదిలో కూర్చో. ఆగది నిండా గుగ్గిళ్లుంటాయి. అర్ధరాత్రి వేళ ఒక తెల్లని గుర్రం అందులోకివచ్చి ఆ గుగ్గిళ్లు తింటూ వుంటుంది. అప్పుడు దాని నోటినుంచి తెల్లని నురుగు వస్తుంది. ఆ నురుగుని నువ్వు అసహ్యించుకోకుండా భక్తితో తాగు. నీకు అన్నివిద్యలు వస్తాయి" అని చెప్పేడు.

"ఆ విద్వాంసుడు గొప్ప హయగ్రీవోపాసకుడు. ఆయన భక్తికి మెచ్చి రోజూ హయగ్రీవుడు స్వయంగా వచ్చి గుగ్గిళ్లు తినిపోతూ ఉండేవాడు. ఆయన చెప్పిన ప్రకారం మల్లినాథుడు ఆ గుగ్గిళ్ల గదిలో కూర్చున్నాడు. అర్ధ రాత్రయింది. పెద్ద జ్యోతి వెలిగింది. గజ్జెల గలగల మ్రోతలు వినిపించాయి. మెఱుపుకి మల్లే ఒక పెద్ద అశ్వరాజం కళ్లకు కట్టింది. మల్లినాథుడు ప్రమత్తుడై దానిని కనిపెట్టుతున్నాడు. ఆ గుర్రము గుగ్గిళ్లు తినడం మొదలు పెట్టింది. కొంత సేపటికి దాని నోటి సందుల గుండా నురుగు పాల పొంగులా పైకి రాసాగింది. ఆ నురు

(56-వ పేజీ చూడండి)

## సిక్కు ఫకీరు అద్భుత సమాధి

"మెగ్రిగోరు"అనే విద్వాంసుడు "సిక్కుల చరిత్రము" అనే గ్రంథమును వ్రాసియున్నాడు. అతడు స్వయముగా చూచిన ఒక అద్భుతవిశేషమును ఆ గ్రంథంలో యీ క్రిందివిధంగా వర్ణించెను.

1837 సంIIలో లాహోరుకు ఒక ఫకీరు వచ్చెను. తన్నొక పెట్టెలోపెట్టి తాళము వేసినయెడల ఎన్ని దినములైనను అన్నపానములు అవసరం లేకుండా జీవింపగలనని చెప్పెను.

అప్పటి పంజాబులో సిక్కు ప్రభువైన రణజిత్తుసింగు అతనిని పరీక్షింపగోరెను : ఆ ఫకీరును ఒక కొయ్యపెట్టెలో పెట్టి, ఆ పెట్టెను నేలక్రింద ఒక సొరంగంలో పెట్టించి పెట్టెకు తాళము వేసిరి. నేల సొరంగము ఒక చిన్న యింటిలో ఉన్నది. ఆ ఇంటికి తాళము వేసిరి. ఇంటిప్రాకార ద్వారమును ఇటుకలతో అడుసుతో కట్టి మూసివేసిరి. గోడకు వెలుపల చుట్టును కాపలాభటులను రణజిత్తు సింగు నియమించెను. 40 దినములు యీరీతిగా కాపలా ఉంచిన పిమ్మట, రణజిత్ సింగున్నూ, ఆయన మనుమడును, చాలామంది సరదారులున్నూ, జనరల్ వెంటామ్ గారున్నూ, కాప్టెన్ వేడేగారును, యీ గ్రంథకర్తయైన మెగ్రిగోరున్నూ హాజరై ఉండగా ఆ ఫకీరును ఆ పెట్టెలోనుంచి బయటకు తీసిరి. కొంత సేపటికి ఆ ఫకీరు మాట్లాడగల్గెను. అతడు యీ అద్భుత కార్యమును చేయగల్గినందుకు రణజిత్ సింగు స్వహస్తములతో ఒక బంగారుగొలుసును అతని మెడలో వేసెను. గౌరవార్థంగా ఫిరంగులను కాల్పించి ఉత్సవము చేసెను.

## విచిత్ర వ్యక్తి

సంతోషించాను. జ్యోతిష్కుణ్ణిగూర్చి అడుగుదామనుకున్నాను. సైతాను సమాధానమిచ్చాడు:

"జ్యోతిష్కుడికి మామూలుగా అయితే చాలా దీర్ఘజీవితమే ఉంది. బోలెడు కష్టాలుపడతాడు. కాని అతని జీవితంకూడా మార్చేస్తాను. అతనికి హాని చెయ్యాలనే ఉద్దేశం నాకు లేదు. అతడెంత చెడ్డవాడైనా అతన్నికూడా బాగుచేద్దామనే అనుకుంటున్నాను. బహుశా అతడు త్వరలో దహనం అయ్యేట్టు చేస్తాను."

బాగుచెయ్యటమంటే సైతాను అభిప్రాయం తగలపెట్టడమన్నమాట. అతడు దేవత. దేవతలకు ఏది మంచి, ఏది చెడ్డ అనేది లేదు. మన మంచిచెడుగులతో వాళ్ళకి సంబంధం లేదు.

సూర్యకాంతి హాయిగా, మృదువుగా మమ్మల్ని స్పృశిస్తోంది. నేను చెయ్యిజాచాను.

"సైతాన్! నా చేతిమీద సూర్యకాంతి పడుతున్నది. దాన్ని మధుపాత్రగా మార్చు," అని అడిగాను. క్షణంలో నా చేతిలోకి మధుపాత్ర వచ్చింది.

"దాన్ని బద్దలుకొట్టు," అన్నాడు.

బద్దలుకొట్టాను. బద్దలైంది.

"చూశావా? ఈ మధుపాత్ర మాయవస్తువు కాదు, నిజమైనది. మీ గ్రామస్థులు ఆ ఇత్తడి బంతులు మాయవనుకున్నారు. వాటిని ముట్టుకోటానికి భయపడ్డారు. ఎంత చిత్రమైన జాతోయ్ మీది? సరే. ఇక పోదామా? నాకు వేరేచోట పనుంది. నిన్ను నీ పక్కమీద పడుకోబెడతాను."

మరుక్షణంలో నేను నా పక్కమీద పడుకుని వున్నాను. సైతాను వెళ్ళిపోయాడు. దూరంనుంచి, వానచినుకుల చప్పుడుగుండా అతని కంఠం వినిపించింది: "సరే. సెప్పీతో చెప్పు. నికొలాస్‌తో చెప్పద్దు. ఇంకెవరికీ కూడా చెప్పకు," అన్నాడు.

నేను అప్పుడే మనసులో అనుకుంటున్నదానికిది సమాధానం.

(ఇంకా వుంది)

★

## మల్లినాధసూరి

★

(37–వ పేజీ తరువాయి)

గాను ఆప్యాయంగా రెండు చేతులా పట్టి లాగేడు. వెంటనే అతనిలో చెప్పలేని మార్పు వచ్చేసింది. అతని నోటిగుండా కవిత్వం వెల్లువలై ప్రవహించింది.

"జ్ఞానానంద మయం దేవం
నిర్మల స్ఫటికాకృతిం।
ఆధారం సర్వవిద్యానాం హయగ్రీవ ముపాస్మహే॥" అని ఆ హయగ్రీవ స్వరూపుడైన విష్ణుమూర్తిని స్తుతించాడు. ఆయన అనుగ్రహం వల్లనే అతనికి సకల శాస్త్రాలు ఒక్క రోజులో వచ్చేశాయి. గురువుగారివద్ద శెలవు తీసికొని ఊర ఊరా తన పాండిత్యం ప్రదర్శిస్తూ కొన్నాళ్లకి అత్తగారి వూరు వచ్చాడు. ఇక్కడ యితని భార్య, భర్త తన మాటలకు కోపగించి వెళ్ళిపోయ్యాడని తెలిసికొని పశ్చాత్తాప పడి ఎప్పటికైనా తిరిగి వస్తాడనే ఆశతో, బాటసారులందరికీ భోజన సదుపాయము చేస్తూ, ఆ వచ్చే బాటసారుల్లో భర్త ఉన్నాడేమో నని పరీక్షిస్తూ ఉండేది.

"చివరికి ఒకనాడు మల్లినాధుడు కూడా బాటసారులతో పాటు భోజనానికి వచ్చాడు. భార్యను గుర్తుపట్టేడు. కాని పెద్దవాడై మార్పు చెందిన భర్తను ఆమె మాత్రము వెంటనే గుర్తించలేక పోయింది. భోజనాలవుతున్నాయి. చారు పోసేరు. దానిలో ఉప్పు తక్కువయింది. అందుకు అందరూ ఊరుకున్నారు కాని, మల్లినాధుడు మాత్రం "పలాశ కుసుమోయథా; లవణేన వినాయఃధారసః" అన్నాడు. దానితో ఆ యిల్లాలు అతన్ని పరకాయించి చూసి గుర్తుపట్టి వెంటనే తనని క్షమించమని కాళ్ల మీద పడ్డది.

"భార్యతో సహా తన తండ్రి దగ్గరకు వెళ్ళి తన పాండిత్యము ప్రదర్శించాడు. తండ్రి ఎంతో సంతోషించి దీవించాడు. కొన్నాళ్లకి మల్లినాథుడు కాళిదాస మహాకవి వ్రాసిన కావ్యాలకు వ్యాఖ్యానాలు రచించాడు.

"చూశావా! కాళిదాసు అంతటి కవి వ్రాసిన కావ్యాలనే వ్యాఖ్యానించాడంటే ఎంత గొప్ప పండితుడో!" అనినే కథ చెప్తుంటే మా తమ్ముడు నోరు తెరుచుకు వింటూ "అక్కయ్యా! నాక్కూడా ఆ పద్యం నేర్పవే. రేపటి నుంచీ నేను కూడా రోజూ హయగ్రీవుని స్మరిస్తా – పాఠాలు బాగా వస్తాయేమోను" అని నాచేత ఆశ్లోకం ఒకటికి రెండుసార్లు చెప్పించుకొని నిద్రకి ఉపక్రమించాడు. ★

Edited Printed & Published by S. Sambhu Prasad at the Andhra Patrika Press, 7, Thambu Chetty St Madras